సాక్షి ఖమ్మం

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



తల్లి పాలు.. అమృతధారలు

పిల్లలకు పాలు పట్టాల్సిన ఆవశ్యకతపై తల్లులకు అవగాహన కల్పించేందుకు నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 8లో



ముగ్గురిని మింగిన కట్లేరు ?

ఎర్రుపాలెం మండలం బంజరకు చెందిన ముగ్గురు మీనవోలు బ్రిడ్జి వద్ద కట్లేరులో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం

33° / 25°

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఓ మోస్తరు కురిసే అవకాశముంది. అన్నిచోట్ల సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ బేగంపేట, రామాంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో 2025–26 విద్యాసంవత్సరం ప్రవేశాలకు గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొన్నారు. ఒకటో తరగతిలో డే స్కాలర్‌గా జిల్లా నుంచి బాలబాలికలకు మూడు చొప్పున సీట్లు కేటాయించగా, లంబాడీ మూడు, కోయలకు రెండుతో పాటు ఇతర గిరిజన కులాలకు ఒక సీటు ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన పేద గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే ఈనెల 12న లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తామని వెల్లడించారు. అలాగే, హెచ్‌పీఎస్‌ల్లో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు రెండు సీట్లు కేటాయించగా గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ చేసిన జనన, కుల, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలతో ఈనెల 8లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ సూచించారు. దరఖాస్తుదారుల్లో ఇద్దరిని ఈనెల 10వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

పనుల్లో నాణ్యతపై అవగాహన అవసరం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఈ వెంకటేశ్వర్లు

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖ ద్వారా చేపట్టే పనుల్లో నాణ్యతపై ఇంజినీర్లు అవగాహన కలిగి ఉండాలని, తద్వారా పనులు పదికాలాలు నిలుస్తాయని శాఖ ఎస్‌ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం ఈఈ వెంకటరమణకుమార్ ఆధ్వర్యాన గురువారం ఇంజనీర్లకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఇంజనీర్లు ఏ విభాగంలో విధులు నిర్వర్తించినా నాణ్యతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ క్వాలిటీ కంట్రోల్ డీఈ చంద్రమోహన్, పాలేరు, ఖమ్మం డివిజన్ల ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బస్టాండే దిక్కు..



ఏన్కూరు మండలంలో సూర్యాతండా కొన్నాళ్ల క్రితం పంచాయతీగా ఏర్పడింది. జీపీ నిర్వహణకు ప్రత్యేక భవనం లేక ప్రభుత్వ పాఠశాలలో ఓ గది కేటాయించారు. ఏడాది క్రితం బస్టాండ్‌లోని ఖాళీ గదికి మార్చారు. ఆ గది ఇరుకుగా ఉండడంతో ఇబ్బందుల నడుమే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ గ్రామంలో జీపీ భవనానికి నిధులు మంజూరు కాగా నిర్మాణం పూర్తయితేనే పాలనా కష్టాలు తీరనున్నాయి.

సాక్షి ఫోకస్

శిథిల భవనాలు.. పాలనా కష్టాలు

గ్రామ స్వరాజ్యానికి పట్టుగొమ్మలుగా నిలిచే గ్రామపంచాయతీల్లో కొన్నింటి భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు ఎప్పుడు కూలుతాయోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొన్ని గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. అంతేకాక కొత్తగా ఏర్పడిన పంచాయతీ భవనాలకు నిధులు మంజూరైనా నిర్మాణ ప్రక్రియ ఏళ్లుగా కొనసాగుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని జీపీ భవనాలు

- కొత్త గ్రామపంచాయతీల్లో మరిన్ని ఇక్కట్లు
- నిధులు మంజూరైనా పూర్తయినవి కొన్నే..

439 సొంతం.. 76 శిథిలం

జిల్లాలో మొత్తం 571 గ్రామపంచాయతీలు ఉండగా, 439 జీపీలు సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగతా 132 పంచాయతీలు అద్దె భవనాల్లో ఉన్నాయి. అయితే, సొంత భవనాల్లో 76 పూర్తిగా శిథిలావస్థకు చేరాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి కాకుండా మరికొన్ని భవనాలు కూడా దెబ్బతినడంతో శ్లాబ్‌లు పెచ్చులూడి.. చువ్వలు బయటకు తేలి కనిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా గోడలన్నీ నాని కురుస్తుండడంతో రికార్డులు తడిసిపోవడమే కాక ఎప్పుడేం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అలాగే, కొన్ని భవనాల్లో విద్యుత్ వైరింగ్ అస్తవ్యస్తంగా మారి వర్షం వచ్చిన సమయాన ప్రమాదాలకు ఆస్కారముండడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈ మండలాల్లో అధ్వానం..

జిల్లాలోని ముదిగొండ మండలంలో 25 గ్రామపంచాయతీలు ఉండగా.. పది భవనాలు శిథిలావస్థకు చేరాయి. కూసుమంచి మండలంలో 41 గ్రామపంచాయతీలకు గాను ఏడింటి భవనాలు దెబ్బతిన్నాయి. బోనకల్ మండలంలో సీతానగరం కొత్త పంచాయతీ ఏర్పడగా స్థల సమస్యతో భవన నిర్మాణం ముందుకు సాగడంలేదు. అలాగే, పెద్ద బీరవల్లి, జానకీపురం, బ్రాహ్మణపల్లి, రాపల్లి, రాయన్నపేట భవనాలు ప్రమాదపుటంచున ఉన్నాయి. ఏన్కూరు మండలంలోని 25 జీపీల్లో 14 సొంతభవనాలు ఉండగా.. కొత్తగా ఏర్పడిన 11 పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి.

కొనసాగుతున్న నిర్మాణాలు..

జిల్లాలో 164 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే, వీటిలా చాలా నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఉంది. ఇందులో 98 పంచాయతీలకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, 66 పంచాయతీలకు ఎస్టీ కాంపోనెంట్ నిధులు కేటాయించారు. వీటిలో కేవలం 47 భవనాల నిర్మాణమే పూర్తయింది.

జిల్లాలోని గ్రామపంచాయతీ భవనాల వివరాలు...

మొత్తం గ్రామపంచాయతీలు	571
సొంత భవనాల్లో ఉన్న జీపీలు	439
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నవి	132
శిథిలావస్థకు చేరిన భవనాలు	76
కొత్త భవనాలు మంజూరైనవి	164
నిర్మాణాలు పూర్తయినవి	47
పనులు కొనసాగుతున్నవి	117

40 ఏళ్ల క్రితం నిర్మాణం



ఏన్కూరు మండలంలోని రాజలింగాల పంచాయతీ భవనాన్ని 40ఏళ్ల క్రితం నిర్మించారు. ఇది ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో స్లాబ్ పెచ్చులూడి పడుతూ వర్షం వస్తే కురుస్తోంది. దీని స్థానంలో కొత్త భవనానికి నిధులు కేటాయించాలని ఉద్యోగులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అమ్మో.. ఆ భవనంలోనా?



బోనకల్ మండలం జానకీపురం గ్రామపంచాయతీ భవనాన్ని 1991లో నాటి కేంద్ర మంత్రి పీ.వీ.రంగయ్య నాయుడు ప్రారంభించారు. భవన నిర్మాణ సమయంలో నాణ్యత పాటించలేదనే ఆరోపణలు ఉండగా కొన్నాళ్లకే శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పైభాగంలో పెచ్చులు ఊడి చువ్వలు తేలగా, వర్షం వస్తే కురుస్తోంది. విధులు నిర్వర్తించేందుకు ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు.. గ్రామసభలను ఆరు బయట టెంట్ వేసి నిర్వహిస్తున్నారు. పలుమార్లు విన్నవించగా ఇటీవల నూతన భవనం మంజూరైంది.

మీ కలలకు రెక్కలమవుతాం..



విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

- మేం వచ్చాకే విద్యాభివృద్ధికి పెద్దపీట
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: 'విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకుని చదువుతూ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి.. అందుకు కావాల్సిన అన్ని వసతులు మేం సమకూరుస్తాం.. పిల్లల అభివృద్ధి బాధ్యతను అన్ని విధాలుగా మేమే చూసుకుంటాం..' అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కూసుమంచిలో రూ.5.50 కోట్ల నిధులతో నిర్మించే ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి మంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు పీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా 76 సైకిళ్లను పంపిణీ చేశాక మంత్రి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కాసేపు సైకిళ్లు తొక్కారు. ఆపై 75 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశాక మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే ఏడాదిన్నర కాలంలో రూ.470 కోట్లు విద్యాభివృద్ధికి వెచ్చించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే, దేశంలో ఎక్కడా లేని విధంగా యంగ్ ఇండియా స్కూళ్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేస్తూ, వసతిగృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలను రెట్టింపు చేశామని మంత్రి గుర్తు చేశారు. ఇక పాలేరు నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కళాశాల, యంగ్ ఇండియా సమీకృత గురుకులం, ఐటీఐ భవనాలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. పేద విద్యార్థులు ఎక్కువగా చదివే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వ పరంగానే కాక పీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా చేయూతనిస్తామని మంత్రి వెల్లడించారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ చదువుకు మించిన ఆస్తి ఉండదని.. తాను కలెక్టర్ కావడానికి చదువే కారణమని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవిబాబు, ఆర్‌డీఓ నర్సింహారావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంఈఓ రాయల శేషగిరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రంతో పాటు నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలతో కార్యాలయాల సముదాయం



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ అనుదీప్

ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ మండలానికి సంబంధించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని సకల సౌకర్యాలతో నిర్మించేలా ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి గురువారం ఆయన తరుణీ హాట్ వద్ద సమీకృత మండల కార్యాలయాల సముదాయానికి ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల లభ్యత, కార్యాలయాల వివరాలపై ఆరా తీశాక మంత్రి మాట్లాడుతూ నిర్మాణ స్థలాన్ని చదును చేయించి పాతబడిన భవనాలను తొలగించాలని సూచించారు. మండల ప్రజల సౌకర్యార్థం ఎంపీడీఓ, తహసీల్, సబ్ రిజిస్ట్రార్, వ్యవసాయ శాఖ ఇలా అన్ని కార్యాలయాలు ఒకేచోట పూర్తిస్థాయి వసతులతో నిర్మించేలా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే, 30 ఫీట్ల రోడ్ల నిర్మాణం, సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి వసతి కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆర్‌డీఓ నర్సింహారావు, మార్కెట్ చైర్మన్ హరినాథ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు..



సిరిపురంలో యూరియా రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

వైరారూరల్/తల్లాడ: జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నందున రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. వైరా పీఏసీఎస్ పరిధి సిరిపురం ఎల్‌ఎస్‌సీఎస్‌తో పాటు తల్లాడ మండలం తల్లాడ, గంగదేవిపాడు సొసైటీల్లో నిల్వ ఉన్న యూరియాను గురువారం డీఏఓ పరిశీలించి మాట్లాడారు. సొసైటీల్లో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నందున అందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. కాగా, వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే యూరియా అమ్మాలని, ఎవరైనా బ్లాక్ చేసినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని డీఏఓ హెచ్చరించారు. ఏఓలు మయాన్ మంజుఖాన్, ఎం.డీ.తాజుద్దీన్, ఏఈఓలు వెంపటి కీర్తి, మేడా రాజేష్, హసీనా, మాధవి, మురళి, శివకుమార్, సాయి, సొసైటీల సీఈఓలు నారపోగు నాగరాజు, నాగబాబు, రాకేష్ పాల్గొన్నారు.

పారదర్శకంగా లేఔట్ అనుమతులు

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిరాకరించాలి
- జిల్లా లేఔట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్



లేఔట్ దరఖాస్తుల మ్యాప్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, కేఎంసీ కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్: నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో లేఔట్ అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లేఔట్ల కోసం వచ్చిన దరఖాస్తులపై రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు. ప్రతిపాదిత ప్రాంతాలు నీటి వనరుల సమీపాన ఉన్నాయా అని గూగుల్ ఎర్త్ ద్వారా పరిశీలించిన కలెక్టర్ మాట్లాడారు. లేఔట్ అనుమతుల సమయాన క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉంటే దరఖాస్తులు తిరస్కరించాలని సూచించారు. ఇక అనుమతి వచ్చిన వాటి విషయంలో మొక్కల పెంపకానికి స్థలం కేటాయించేలా చూస్తూ స్ట్రీట్ లైట్లు, డ్రెయినేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, ఫైర్ సేఫ్టీ చర్యలపై పర్యవేక్షించాలని తెలిపారు. లేఔట్లకు అనుమతులు ఇచ్చాక విద్యుత్ స్తంభాల కేటాయింపునకు ఎన్పీడీసీఎల్ అధికారులతో చర్చించి వారంలోగా చెల్లించకపోతే డ్రాఫ్ట్ అనుమతి ఉపసంహరించాలని కలెక్టర్ చెప్పారు. కాగా, జిల్లాలో ఇక నుంచి ప్రతీ 15 రోజులకోసారి లేఔట్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, సుడా సీపీఓ రాజ్‌కుమార్, పీఆర్ ఈఈ మహేష్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఏ.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

కూసుమంచి: సీజనల్ వ్యాప్తి నేపథ్యాన వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు హోమియో, ఆయుర్వేద ఆస్పత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డులు, ఉద్యోగుల హాజరును పరిశీలించాక మందుల లభ్యతపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, సాధారణ ప్రసవాలు పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. తహసీల్దార్ రవికుమార్, వైద్యాధికారులు సాయికుమార్, లక్ష్మీలోహిత, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలు, ఎస్‌ఏలకు పదోన్నతులు

రేపటి నుంచి 11వ తేదీ వరకు ప్రక్రియ

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియ మొదలవుతోంది. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతుల షెడ్యూల్‌ను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. దీంతో సీనియారిటీ ఆధారంగా అర్హులు అంచనాల్లో నిమగ్నమయ్యారు. తొలుత స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తారు. ఆపై ఏర్పడే ఖాళీల ప్రకారం ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు.

షెడ్యూల్ ఇలా...

ఈనెల 2న శనివారం మొదలయ్యే పదోన్నతుల ప్రక్రియ 11వ తేదీన ముగుస్తుంది. తొలిరోజైన శనివారం గ్రేడ్–2 హెచ్‌ఎంల ఖాళీలతో పాటు పదోన్నతికి అర్హులైన ఎస్‌ఏల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచి, 3న అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఇక 4, 5వ తేదీల్లో అభ్యంతరాలు పరిష్కరించి తుది జాబితా విడుదల చేస్తారు. అలాగే, 6వ తేదీ వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించి పదోన్నతి పొందిన వారికి 7న ఉత్తర్వులు అందజేస్తారు. ఇది పూర్తయ్యాక స్కూల్ అసిస్టెంట్లుగా ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించేలా 8న ఖాళీలు, అర్హుల జాబితా విడుదల చేస్తారు. ఈ జాబితాపై 9వ తేదీన అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించాక తుది జాబితా రూపొందిస్తారు. ఆపై 10వ తేదీన వెబ్ ఆప్షన్లు స్వీకరించి అర్హత కలిగిన ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పిస్తూ 11వ తేదీన ఉత్తర్వులు అందజేస్తారు.

జూలైలో 18.4 శాతం అధిక వర్షపాతం

ఖమ్మంవ్యవసాయం: జూలైలో జిల్లా సగటున పరిశీలిస్తే అధిక వర్షపాతం నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 236.5మి.మీ.లు కాగా 280.1 మి.మీ.లుగా నమోదైందని అధికారులు వెల్లడించారు. ఖమ్మం రూరల్, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, మధిర మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, ఖమ్మం అర్బన్ మండలంలో స్వల్పంగా లోటు నమోదైందని, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని తెలిపారు.

సుడాపై పట్టింపేది?

2023 డిసెంబర్‌లో రద్దయిన పాలకవర్గం

- ఆతర్వాత కార్యాలయ భవనం సైతం ఖాళీ
- మాస్టర్ ప్లాన్‌లోనూ కానరాని కదలిక
- పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా వెంచర్ల ఏర్పాటు, నిర్మాణాలు



గతంలో డీసీసీబీ భవనంలో కొనసాగి 'సుడా'

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న గ్రామాల అభివృద్ధికి గత ప్రభుత్వం స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ను ఏర్పాటు చేసింది. ఆపై పాలకవర్గాన్ని నియమించగా.. వెంచర్ల ఏర్పాటు, నిర్మాణాలకు అనుమతులు మంజూరు తదితర పనులు కొనసాగాయి. అయితే, ప్రభుత్వం మారాక 2023 డిసెంబర్‌లో పాలకవర్గాన్ని రద్దు చేసినా కొత్త పాలకవర్గాన్ని నియమించకపోవడం.. కనీసం కార్యాలయం కూడా లేకపోవడంతో పర్యవేక్షణ లోపించి ఇష్టారాజ్యంగా వెంచర్ల ఏర్పాటు, నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇదే అదనుగా కొందరు ఉద్యోగులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

2017లో ఏర్పాటు

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 2017 అక్టోబర్ 24న ఏర్పాటైంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వైరా మున్సిపాలిటీ, కూసుమంచి, ఖమ్మంరూరల్, ముదిగొండ, చింతకాని, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లోని 44 గ్రామపంచాయతీలతో 573 చదరపు కి.మీ. వైశాల్యంతో సుడాను ఏర్పాటు చేశారు. ఈ పరిధిలో అభివృద్ధి పనులే కాక నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటును పర్యవేక్షించాల్సి ఉంటుంది.

పరిధి మరింత విస్తరణ

'సుడా' విస్తరణతో అభివృద్ధి పనుల పర్యవేక్షణ సులువవుతుందని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. హెచ్‌ఎండీఏ విస్తరణ ద్వారా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి ఆధారంగా ఈ నిర్ణయం తీసుకోగా... జిల్లాలో అభివృద్ధికి వీలుగా ఉన్న అన్ని ప్రాంతాలను సుడా పరిధిలోకి తీసుకొచ్చారు. కామేపల్లి, ఏన్కూరు, కారేపల్లి మినహా అన్ని మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీలను చేర్చారు. తద్వారా 17 మండలాల పరిధిలోని 279 గ్రామపంచాయతీలను, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలను సుడాలో విలీనం చేస్తూ 2024 అక్టోబర్‌లో జీఓ జారీ చేశారు.

పాలకవర్గం రద్దు

తొలిసారి 'సుడా'కు 2020 జూన్‌లో పాలకవర్గాన్ని నియమించగా, 2023 డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అదే నెలలో 10వ తేదీన పాలకవర్గాన్ని రద్దు చేసింది. చైర్మన్‌తో పాటు 14 మంది డైరెక్టర్లు పదవులు కోల్పోగా, ఇప్పటి వరకు కొత్త పాలకవర్గాన్ని నియమించలేదు. దీంతో 'సుడా' కార్యకలాపాలన్నింటినీ వైస్ చైర్మన్‌గా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పర్యవేక్షిస్తున్నారు. కాగా, పూర్తి స్థాయిలో ఉద్యోగులను నియమించని కారణంగా కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులే సుడా పనులనూ చక్కబెడుతున్నారు.

అభివృద్ధికి ఆటంకం

సుడా ఏర్పడ్డాక ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుడా పరిధిలో మాస్టర్ ప్లాన్ ముసాయిదా సిద్ధమైనా రకరకాల కారణాలతో గత ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. ఫలితంగా పాత ప్రణాళికలతోనే వెంచర్ల ఏర్పాటు, అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక సుడా విస్తరించిన తర్వాత కూడా మాస్టర్ ప్లాన్ ఆమోదానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇష్టారీతిన జరుగుతున్న నిర్మాణాలు భవిష్యత్ అభివృద్ధికి ఆటంకంగా మారే అవకాశముందన్న చర్చ జరుగుతోంది.

కార్యాలయం ఖాళీ

పాలకవర్గం ఏర్పడిన తర్వాత సుడా కార్యాలయాన్ని రోటరీక్లబ్ పక్కన డీసీసీబీ బ్యాంక్ భవనంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారాక పాలకవర్గాన్ని రద్దు చేయడంతో ఆ భవనం నుంచి ఖాళీ చేయించారు. దీంతో కార్యాలయ సామగ్రిని కేఎంసీకి తరలించి టౌన్‌ప్లానింగ్ విభాగంలోని ఓ గదిలో పెట్టించారు. ఫలితంగా పాలకవర్గం మాటేమో కానీ కనీసం కార్యాలయం కూడా లేక సుడా పాలన అగమ్యగోచరంగా మారింది.

ముఖం చూపిస్తేనే హాజరు!

నేటి నుంచి యాప్ ద్వారా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల హాజరు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల హాజరును పక్కాగా నమోదు చేసేలా రాష్ట్రప్రభుత్వం ముఖ గుర్తింపు విధానాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. పలుచోట్ల కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే విమర్శల నేపథ్యాన గతంలోనే విద్యాశాఖ ముఖ గుర్తింపు ద్వారా నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో శుక్రవారం నుంచి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో 4,924 మంది

జిల్లాలోని 1,213 పాఠశాలల్లో 5,816 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ఇందులో ఖాళీలు పోగా 4,924 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉదయం 9–05నుంచి సాయంత్రం 4–15 గంటల వరకు, ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9–05 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఈమేరకు ప్రతీ హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు రెండు పూటలా ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్) యాప్ ద్వారా పాఠశాల ఆవరణ నుంచే హాజరు వేయాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాక పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసి.. ఆపై ఉన్నతాధికారులతో అనుసంధానం చేయించుకోవాలి. ఆతర్వాత స్కూల్ ఆవరణలోనే ఉదయం, సాయంత్రం హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. తద్వారా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు హాజరును పర్యవేక్షించవచ్చని, రకరకాల కారణాలతో సమాచారం లేకుండా, సెలవు పెట్టకుండా గైర్హాజరయ్యే ఉపాధ్యాయులను కట్టడి చేయొచ్చని భావిస్తున్నారు. ఈ విధానంతో విద్యార్థులు మేలు జరగడంతో పాటు ప్రభుత్వ విద్యారంగంపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని చెబుతున్నారు.

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

ఖమ్మంసహకారనగర్: హెచ్‌సీఎల్ టెక్ ఆధ్వర్యంలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఐటీ, డీపీఓ ఉద్యోగాల్లో అవకాశం కల్పించేందుకు ఈ నెల (ఆగస్టు) 2న నగరంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కె.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్నవారు 2న నయాబజార్ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు పది, ఇంటర్మీడియట్ మెమోలు, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆండ్రాయిడ్ మొబైళ్లతో హాజరు కావాలని, పూర్తి వివరాల కోసం 83414 05102, 79818 34205 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జాబ్‌మేళాలో 23మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన గురువారం ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కంపెనీల బాధ్యులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించగా 51 మందిలో 23 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేగులచలకలో కేంద్రబృందం పరిశీలన

రఘునాథపాలెం: కేంద్రప్రభుత్వ పథకాల అమలు, చేపట్టిన అభివృద్ధి పనులను మండలంలోని రేగులచలకలో నేషనల్ లెవల్ మానిటరింగ్(ఎన్ఎల్ఎం) బృందం పరిశీలించింది. ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, రిజిస్టర్ల నిర్వహణపై ఆరా తీశాక ఉపాధిహామీ కూలీలు, డ్వాక్రా మహిళలు, గ్రామ సంఘం సభ్యులతో సమావేశమై పథకాల ద్వారా జరిగిన లబ్ధిని తెలుసుకున్నారు. అలాగే, గ్రామపంచాయతీ రికార్డులను కూడా తనిఖీ చేసిన బృందం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ లబ్ధిదారులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. అనంతరం అంగన్‌వాడీల్లోని టాయిలెట్లు, అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలు, సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. కేంద్ర బృందంలో డాక్టర్ డీ.డీ.గరుడ, ఎన్.అశ్విన్ గోపాల్‌తో పాటు ఎంపీడీఓ అశోక్‌కుమార్, వివిధ శాఖల ఉద్యోగులు చలపతిరావు, శ్రీదేవి, పద్మయ్యనాయుడు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, దీపక్, మాజీ ఉపసర్పంచ్ యండపల్లి సత్యం, అన్నం భూషయ్య పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం


సన్మానం అందుకున్న వారితో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులను సీపీ సునీల్‌దత్ గురువారం సన్మానించారు. ఖమ్మంలోని కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకే కాక ప్రజలకు సేవలు చేశారని కొనియాడారు. ఈమేరకు ఏఆర్ ఎస్సై మోహన్‌రావుతో పాటు ఏఎస్సైలు ముత్తయ్య, లచ్చు, ఉద్యోగులు సైదయ్య, మన్సూర్, బాలకృష్ణ, వెంకయ్య, ఆనందరావును సన్మానించగా అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, సురేష్, నాగుల్ మీరా, పోలీస్ ఉద్యోగుల అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో మోకీలు శస్త్రచికిత్స

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు మోకీలు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 55ఏళ్ల బి.కల్యాణి మోకాలి నొప్పితో చాన్నాళ్లుగా బాధపడుతుండగా, పెద్దాస్పత్రి వైద్యులను సంప్రదించింది. దీంతో పరీక్షలు చేశాక ఆస్పత్రి ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ ఎల్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన గురువారం ఆమెకు మోకీలు శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్ర చికిత్సలో హెచ్‌ఓడీతో పాటు వైద్యులు వినయ్‌కుమార్, మణికంఠ, మనీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే ఆయిల్‌పామ్

కారేపల్లి: ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌తో లాభాలు ఎక్కువగా వస్తాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. మండలంలోని చీమలపాడులో పలువురు రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను గురువారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. కోతుల బెడద, చీడపీడలు లేకపోవడమే కాక ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా ఆయిల్‌పామ్ తట్టుకుంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఫ్యాక్టరీలు కూడా ఉన్నందున మార్కెటింగ్ సమస్య ఉండదని చెప్పారు. ఇవికాక ప్రభుత్వం రాయితీపై మొక్కలు ఇవ్వడంతో పాటు నిర్వహణ ఖర్చులు, సబ్సిడీపై డ్రిప్ అందజేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని మధుసూదన్ సూచించారు. వైరా డివిజన్ ఉద్యానవన అధికారి ఆకుల వేణు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణి, రైతు పోతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.17,463

తల్లి పాలు.. అమృతధారలు

- పెద్దాస్పత్రిలో మిల్క్ బ్యాంక్ ద్వారా సేకరణ
- వేలాది మంది చిన్నారులకు లబ్ధి
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ఖమ్మం వైద్యవిభాగం: వివిధ కారణాలతో కొందరు బాలింతలకు చనుబాలు సరిపడా వచ్చే పరిస్థితి ఉండడం లేదు. ఫలితంగా వారి శిశువులకు పాలు పట్టే పరిస్థితి లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక కొందరికి చనుబాలు ఉన్నా అపోహలతో పిల్లలకు పట్టడం లేదు. దీంతో పిల్లల్లో పోషకాహార లోపం ఎదురవుతోంది. ఈమేరకు తల్లి పాల ప్రాముఖ్యతపై ప్రచారం చేయడమే కాక గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 1నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాలు శుక్రవారం మొదలుకానున్న నేపథ్యాన జిల్లా పెద్దాస్పత్రిలోని 'మిల్క్ బ్యాంక్'పై కథనం.

2022లో ఏర్పాటు

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లుల నుండి పాలు సేకరించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మిల్క్ బ్యాంక్ పేరుతో 2022 మే నెలలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా వేలాది మంది శిశువులకు లబ్ధి జరుగుతోంది. కొందరు బాలింతలకు చనుబాలు రాకపోగా.. ఇంకొందరికి పిల్లలకు అవసరమైన పాల కంటే ఎక్కువగా వస్తుంటారు. ఇలాంటి వారి నుంచి పాలు సేకరించి మిల్క్ బ్యాంక్‌లోని ప్రత్యేక ఫ్రీజర్లలో నిల్వ చేస్తారు. ఆపై అవసరమైన వారికి అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రం కొనసాగుతోంది. గర్భిణులను ప్రతీనెలా వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి వస్తున్న నేపథ్యాన వారికి తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూనే అధికంగా పాలు ఉంటే బ్యాంక్‌కు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా ఏటేటా ఈ మిల్క్ బ్యాంకుకు పాలు సమకూర్చే బాలింతల సంఖ్య పెరుగుతోంది.


ఫ్రీజర్‌లో నిల్వ చేసిన తల్లి పాల సీసాలు

పెద్దాస్పత్రిలోని మిల్క్ బ్యాంక్ ద్వారా సేకరించి, పిల్లలకు ఇచ్చిన పాల వివరాలు

ఏడాది	బాలింతలు	సేకరించిన పాలు (లీటర్లలో)	పిల్లలకు అందించిన పాలు (లీటర్లలో)	లబ్ధి పొందిన శిశువులు
2022	396	139	138	480
2023	901	277	239	1,145
2024	929	295	288	3,851
2025 (ఇప్పటి వరకు)	1,163	167	181	2,541


ఖమ్మం పెద్దాస్పత్రిలోని మిల్క్ బ్యాంక్

బిడ్డకు బలం.. వ్యాధులు దూరం

సత్తుపల్లిటౌన్: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే తల్లీబిడ్డకు శ్రీరామరక్షగా నిలవడమేకాక బిడ్డకు వ్యాధులు దరిచేరని వైద్యులు చెబుతుంటారు. శిశువులకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రోగ నిరోధక శక్తికి పెంచే అమ్మపాలు అమృతంతో సమానమని గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించేందుకు నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు నిర్వహించనున్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ ద్వారా ఈ వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా 1నుంచి 7వ తేదీ వరకు చేపట్టాల్సిన ప్రత్యేక కార్యక్రమాలకు షెడ్యూల్ రూపొందించారు.

ముర్రుపాల విశిష్టత

ప్రసవం అయ్యాక బాలింతకు మొదటగా వచ్చే వాటిని ముర్రుపాలు అంటారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఈ పాలను బిడ్డకు ఇవ్వకుండా వృథా చేసి తర్వాతే ఇస్తుంటారు. కానీ ముర్రుపాలతో శిశువుల్లో రోగనిరోధక శక్తిని పెంచే గుణం, మాంసకృతులు, విటమిన్లు ఉంటాయి. ఈ పాలు పట్టడం వల్ల పిల్లల్లో చురుకుదనం, తెలివితేటలు పెరుగుతాయి. అంతేకాక తల్లిపాలతో శిశువుకు సమతుల ఆహారం అందుతుందని, ప్రొటీన్లు, విటమిన్లు ఉండడంతో కాల్షియం నిల్వలు పెరిగి బిడ్డలకు రక్తహీనత ఎదురుకాదు. డయేరియా, న్యూమోనియా, కేన్సర్, గుండెజబ్బులు, ఎలర్జీ, ఆస్తమా, డయాబెటిస్ వ్యాధుల నుంచి రక్షణ కల్పించడమే కాక ఇన్ఫెక్షన్లు తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు.


సత్తుపల్లిలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ (ఫైల్)

ముర్రుపాలు పట్టించా...



నాకు సాధారణ కాన్పు ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో బాబు పుట్టాడు. వైద్యులు, సిబ్బంది సూచనలతో బిడ్డ జన్మించిన అరగంటలోపే ముర్రుపాలు పట్టించా. ఇద్దరికి ఎలాంటి ఇబ్బంది లేదు. పాలు పట్టించే విధానంపై ఇక్కడ సిబ్బంది అవగాహన కల్పించారు.

– ఎస్.మేఘన, సత్తుపల్లి

విస్తృతంగా అవగాహన..



తల్లి పాల వారోత్సవాల నిర్వహణకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. శిశువుకు సరిపడా పాలు వచ్చేలా గర్భంతో ఉన్నప్పటి నుంచే తగిన మోతాదులో పౌష్టికాహారం తీసుకోవాలి. ఈ విషయమే కాక తల్లి పాల ప్రాముఖ్యతపై వారోత్సవాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తాం.

– రాంగోపాల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ

'పద్మమ్' సిల్వర్ జ్యుయలరీ స్టోర్ ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్: ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న పద్మమ్ సిల్వర్ జ్యుయలరీ స్టోర్‌ను ఖమ్మం వైరారోడ్డులో ఏర్పాటుచేశారు. ఈ స్టోర్‌ను సినీ నటి రీతూవర్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మమ్ స్టోర్‌ను తాను ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ అన్ని రకాల ఆభరణాలు ఎంతగానో నచ్చాయని, ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటించిన ఆఫర్లు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. రూ.లక్ష విలువైన కొనుగోలుపై రూ.50వేల విలువైన వెండి ఆభరణాలు, రూ.50 వేల కొనుగోలుపై రూ.20 వేలు, రూ.20 వేల కొనుగోలుపై రూ.12,500 విలువైన వెండి ఆభరణాలు ఉచితంగా ఇచ్చే ఆఫర్ ఆగస్టు 15వరకు అందుబాటులో ఉంటుందని షోరూం నిర్వాహకులు ప్రకటించారు.


'పద్మమ్' స్టోర్ వద్ద నటి రీతూవర్మ, నిర్వాహకులు

నిబద్ధతతో సేవలందించిన వెంకటనాగేశ్వరరావు

ఖమ్మం మయూరిసెంటర్: వృత్తి నిబద్ధతతో విధులు నిర్వర్తించిన వనం వెంకట నాగేశ్వరరావు సంస్థపై ప్రజల్లో నమ్మకం పెంచారని బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ ఇంజనీర్ వెంకట నాగేశ్వరావు ఉద్యోగ విరమణ సన్మాన గురువారం ఖమ్మంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ డీజీఎం రాజశేఖర్, ఏజీఎంలు సుష్మా, శ్రీనివాస్, పీఎస్ఎన్ఎల్ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు తదితరులు మాట్లాడుతూ ఎక్కడైనా సమస్య వస్తే రాత్రీపగలు తేడా లేకుండా ఆయన స్పందించేవారని కొనియాడారు. అనంతరం వెంకటనాగేశ్వరావు – స్వర్ణలత దంపతులను పలువురు సన్మానించగా అర్చకులు బొర్రా వాసుదేవాచార్యుల బృందం వేద మంత్రాలతో ఆశీర్వదించింది. ఈకార్యక్రమంలో నాగేశ్వరరావు కుమార్తె, కుమారుడు రాణి రాజ్యలక్ష్మి, రాజీవ్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తిరుమలాచార్యులు, బీఆర్.వీరస్వామి, సోమగాని ఉపేందర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సన్మాన సభలో వెంకటనాగేశ్వరావు, అధికారులు

పరిశుభ్రతతోనే వ్యాధుల కట్టడి

తిరుమలాయపాలెం: ప్రతీఒక్కరు ఇళ్లలోనే కాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీ వ్యాధికి కారణమైన దోమలని అరికట్టవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి తెలిపారు. మండలంలోని చంద్రుతండాలో ఇటీవల డెంగీ కేసులు నమోదైన నేపథ్యాన గురువారం ఆమె గ్రామంలో పారిశుద్ధ్య పనులు, వైద్యశిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. డెంగీతో పాటు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సుబ్లేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వసుంధర, ఉద్యోగులకు సూచించారు. డీపీఓ దుర్గ, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైరా పీహెచ్‌సీ సోమవరానికి...

వైరా: వైరాలో కొనసాగుతున్న పీహెచ్‌సీని మున్సిపాలిటీ పరిధి సోమవరం గ్రామానికి మార్చారు. వైరా పీహెచ్‌సీ భవనంలో వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిని నిర్వహించనుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు సోమవరంలో పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి గురువారం ప్రారంభించారు. వైద్యాధికారి శ్రీహర్ష, ఉద్యోగులు జన్ను జాన్సన్, నరసింహారావు, అనంతరాములు, ఏసుమణి, రాజ్యలక్ష్మి, కొండలరావు, శాస్త్రి, నాగమణి, రజియా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని మింగిన కట్లేరు?

- చేపల వేటకు వెళ్లగా గల్లంతు
- రాత్రి వరకు గాలించినా కానరాని ఫలితం

ఎర్రుపాలెం: రెక్కాడితే డొక్కాడని పేద కుటుంబాలు.. వరదలో వేటాడితే చేపలు దొరుకుతాయనే భావనతో వెళ్లిన ముగ్గురు అదే వరదలో గల్లంతయ్యారు. అర్ధరాత్రి వరకు గాలింపు చేపట్టిన వారి జాడ తెలియరాకపోవడంతో మూడు కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాయి.

ఈత రాక.. గుంతలు తెలియక

ఎర్రుపాలెం మండలం బంజర గ్రామానికి చెందిన బాదావత్ రాజు(55), భూక్యా కోటి(46), భూక్యా సాయితో పాటు మరో ఐదుగురు గురువారం చేపలు పట్టడానికి మీనవోలు బ్రిడ్జి వద్ద కట్లేరుకు వెళ్లారు. అంతా కలిసి చేపలు పట్టేందుకు అనువుగా ఉన్న ప్రదేశాన్ని ఎంచుకున్నారు. కట్లేరులో వరద ప్రవాహం పెద్దగా లేకపోయినా పలుచోట్ల దాదాపు 20 అడుగుల లోతు మేర గుంతలు ఉన్నాయి. దీంతో అంతా ఒకే చోట వలలు విసురుతూ చేపల వేట మొదలుపెట్టాక రాజు, కోటి, సాయి ఈత రాని కారణంగా గుంతల్లో మునిగిపోయారు. దీంతో ఈత వచ్చిన మిగతా ఐదుగురు వారి కోసం గాలించినా ఫలితం లేక బాధిత కుటుంబీకులకు, ఆపై అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు వైరా ఏసీపీ రహమాన్, మధిర సీఐ డి.మధు, ఎస్ఐ ఎం.రమేష్, తహసీల్దార్ ఎం.ఉషాశారద చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పిలిపించి రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా ఫలితం కానరాలేదు. కాగా, ముగ్గురు గల్లంతైన విషయం తెలియగానే వారి కుటుంబీకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. రాత్రి వరకు కూడా వారి జాడ తెలియకపోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మళ్లీ శుక్రవారం ఉదయమే ఎన్డీఆర్ఎఫ్ బృందంతో గాలింపు మొదలుపెడతామని అధికారులు వెల్లడించారు.


సహాయక చర్యలను పరిశీలిస్తున్న పోలీసులు, రెవెన్యూ ఉద్యోగులు

డీఆర్‌డీఏ – సెర్ప్ ఏపీఎంల బదిలీలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణాభివృద్ధి (డీఆర్‌డీఏ)–సెర్ప్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఏపీఎంలను బదిలీ చేస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు సంబంధించి ఇతర ప్రాంతాల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఏపీఎంలను జిల్లాలో అవసరమైన మండలాలకు కేటాయించారు. కాగా, బదిలీ ఉద్యోగులు శుక్రవారంకల్లా కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీఎంలు, ప్రస్తుత, బదిలీ స్థానాల వివరాలు

కూసుమంచి ఏపీఎం ఐ.సత్యవర్ధన్‌ను ఖమ్మం రూరల్‌కు, జంగం లక్ష్మణ్‌రావును డీఆర్‌డీఓ నుంచి మధిర ఇందిరా మహిళా డెయిరీకి, కె.వెంకటసుబ్బారావును సత్తుపల్లి నుంచి వేంసూరుకు, వై.పద్మలతను బోనకల్ నంచి డీఆర్‌డీఏకు, కె.వెంకటేశ్వర్లును ఎర్రుపాలెం నుంచి బోనకల్‌కు, కురవిలో పనిచేస్తున్న డి.సత్యనారాయణను ముదిగొండకు, కె.సురేంద్రబాబును ఏన్కూరు నుంచి నేలకొండపల్లికి, జి.రవికుమార్‌ను టేకులపల్లి నుంచి తల్లాడకు, బి.రాంబాబును మధిర నుంచి వైరాకు బదిలీ చేశారు. అలాగే, ఎం.జోసెఫ్ బెనర్జీని మహబూబాబాద్ నుంచి కూసుమంచికి, కె.శ్యాంకుమార్‌ను వైరా నుంచి ఏన్కూరుకు, జి.చిన్న వెంకటేశ్వర్లును ముదిగొండ నుంచి కొణిజర్లకు, ఎం.వెంకటరామారావును చింతకాని నుంచి కామేపల్లికి, ఐ.సత్యనారాయణను జూలూరుపాడు నుంచి మధిరకు, జి.అశోకరాణిని నేలకొండపల్లి నుంచి కల్లూరుకు, పి.శారదను రఘునాథపాలెం నుంచి స్తంభాద్రి మహిళా సమాఖ్యకు బదిలీ చేశారు. ఇక ఎం.రాజేశ్వరరావును డీఆర్‌డీఏ నుంచి రఘునాథపాలెంకు, పి.వెంకటేశ్వర్లును ఖమ్మం నుంచి సింగరేణి మండలానికి, వి.కల్పనను కల్లూరు నుంచి పెనుబల్లికి, బి.నాగపుల్లారావును పెనుబల్లి నుంచి చింతకానికి, పి.హరినారాయణను సింగరేణి నుంచి ఎర్రుపాలెంకు, ఆర్.తిరుమలారావును కొణిజర్ల నుంచి సత్తుపల్లికి, కె.సంపత్‌కుమార్‌ను ములకలపల్లి నుంచి తిరుమలాయపాలెంకు బదిలీ చేశారు. అంతేకాకుండా తల్లాడ నుంచి ఎం.శ్రీనివాసరావు, మహబూబాబాద్ నుంచి బి.అశోక్‌పాల్, ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ ఆలస్యం శ్రీనివాసరావు, మహబూబాబాద్ నుంచి ఆలేటి శ్రీనివాసరావు, కామేపల్లి నుంచి ఎల్.సుశీలను ఖమ్మం డీఆర్‌డీఏకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వడలిపోతున్న పత్తి మొక్కలు

- చేన్లలో నీటి నిల్వతో దెబ్బతింటున్న వేరు వ్యవస్థ
- సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే పంటకు రక్షణ


అధిక వర్షాలతో వడలిపోయిన పత్తి మొక్కలు


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

బోనకల్: ఇటీవల వరుస వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నది. మేలో తొలకరి జల్లులు పడడంతో రైతులు పత్తి విత్తనాలను విత్తారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో మొక్కలను బతికించుకునేందుకు అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అడపాదడపా పడిన జల్లులకు పత్తిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఇంతలోనే వారం రోజులుగా ఎడతెరిపి లేని భారీవర్షాలకు పత్తి పొలాల్లో నీరు నిలిచింది. రైతులు సాధ్యమైనంత మేర నీటిని బయటకు పంపినా ప్రతిరోజూ వర్షం పడడంతో భూమి అధిక నీరు పీల్చుకోవడంతో మొక్క వేరు వ్యవస్థ దెబ్బతిన్నది. ఇప్పుడు పొడి వాతావరణంతో ఎండకు పత్తి మొక్కలు వడలిపోతుండగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పత్తి పంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బోనకల్ మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్ కుమార్ చేసిన సూచనలు ఇలా ఉన్నాయి.

సమగ్ర యాజమాన్య పద్ధతులు..

- కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి ఆ మిశ్రమాన్ని పత్తి మొక్క మొదటి భాగం తడిచే విధంగా పిచికారీ చేయాలి.
- సాధ్యమైనంత వరకు పత్తి చేన్లలో నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపించాలి.
- వర్షపు నీరు నిలబడిన చోట సూక్ష్మధాతు లోపం వచ్చే అవకాశం ఉన్నందున 10 గ్రాముల యూరి యా లేదా 19:19:19 లేదా 13:0:45 లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- అధిక వర్షాలకు నల్లనేలల్లో వేరు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున అనవాళ్లు కనిపించగానే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండైజిమ్ 1 గ్రా.ను లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్లను తడపాలి.
- అధిక వర్షాలకు లేత పసుపు రంగుకు మారిన మొక్కలకు పొటాషియం నైట్రేట్ 5 గ్రా.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే మొక్కలు సాధారణ స్థితికి చేరుతాయి.
- రైతులు నానో ద్రవ యూరియా వాడడం ద్వారా మొక్క పైభాగం నుంచి నత్రజని అందించవచ్చు.

వేతనాలు పెంచాలి.. పర్మనెంట్ చేయాలి


ఖమ్మంమయూరిసెంటర్: సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీయూసీఐ(ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రామయ్య డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో గురువారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి మయూరి సెంటర్, బస్టాండ్, వైరా రోడ్ మీదుగా జెడ్పీ సెంటర్ వరకు ఈ ప్రదర్శన జరగగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో రామయ్య మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. టీయూసీఐ నాయకులు కె.శ్రీనివాస్, ఆవుల అశోక్, పి.రామదాస్, ఈ.శరత్, ఎస్.కే.లాల్ మియా తదితరులు మాట్లాడగా డీఆర్‌ఓ, డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.పుల్లారావు, ములకలపల్లి లక్ష్మీనారాయణ, గోసు పుల్లయ్య, పేరబోయిన వెంకన్న, అంబేద్కర్ అశోక్, పాపారావు, మధుర, కృష్ణవేణి, బి.రమేష్, జె.రాంబాబు, దున్న గురవయ్య, కిన్నెర నారాయణ, గొడుగు విజయ్, పెదపాక వెంకన్న, అమరపుడి అప్పారావు, మీగడ సైదులు, కంకణాల శ్రీనివాస్, ఎడ్లపల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న టీయూసీఐ నాయకులు, కార్మికులు

నాట్లు వేస్తుండగా గుండెపోటుతో రైతు మృతి

కొణిజర్ల: వరి నార్లు వేస్తుండగా గుండెపోటు రావడంతో ఓ రైతు మృతి చెందాడు. కొణిజర్లకు చెందిన బండారు పుల్లయ్య(63) గురువారం తన పొలంలో నారు కట్టలు పరిచేందుకు వెళ్లాడు. నార్ల కట్టలు మోస్తుండగా గుండెపోటుకు గురైన ఆయన కన్నుమూశాడు. పుల్లయ్యకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, సీపీఐలో కొనసాగుతున్న ఆయన మృతదేహం వద్ద జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు గడల భాస్కర్, ఎర్రా బాబు, దొండపాటి రమేష్, స్వర్ణ రమేష్, తోటపల్లి సీతారాములు, తాటి వెంకటేశ్వర్లు, తాటి నిర్మల, లతాదేవి, కళావతి నివాళులర్పించారు.


బండారు పుల్లయ్య (ఫైల్)

విద్యుదాఘాతంతో మహిళ...

కారేపల్లి: ఆరవేసిన దుస్తులు తీసే క్రమాన విద్యుదాఘాతానికి గురైన మహిళ మృతి చెందింది. కారేపల్లి మండలం విశ్వనాథపల్లికి చెందిన బొగ్గారపు సరస్వతి(52) ఇంటి రేకుల షెడ్డులో కట్టిన జీ వైర్‌పై దుస్తులు ఆరేసింది. అయితే, షెడ్డు మీదుగా విద్యుత్ వైర్ వెళ్లడంతో జీ వైర్ గుండా విద్యుత్ ప్రసారమవుతున్నట్లు తెలిసింది. ఈమేరకు దుస్తులు తీసే క్రమాన సరస్వతి విద్యుదాఘాతానికి గురికాగా బట్టలు గట్టిగా లాగడంతో జీ వైరు తెగి మెడకు చుట్టుకుని తప్పించుకోలేక అక్కడే కుప్పకూలింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. సరస్వతికి భర్త కిషన్‌రావు, ఓ కుమారుడు ఉన్నాడు.

జేసీబీ, ట్రాక్టర్లు సీజ్

కామేపల్లి: అనుమతి లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్న జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను పోలీసులు గురువారం సీజ్ చేశారు. కామేపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా శివార్లలో ప్రభుత్వ భూమి నుంచి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారని గుర్తించారు. ఈమేరకు జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి విచారణ కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.